సాక్షి నిజామాబాద్

మంగళవారం ၊ 2 ၊ జూలై ၊ 2024



ఉద్యమించాలి కానీ..

సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఉద్యమాలు చేయాలి కానీ ప్రాణాలు కోల్పోవద్దని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.

- 8లో ▸



ప్రజావాణికి 130 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 130 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్, అధికారులు వినతులు స్వీకరించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 35.6 /22.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

1,321 మంది ఎస్జీటీల బదిలీ

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో ఎట్టకేలకు బదిలీలు పూర్తయ్యాయి. సోమవారం 1,321 మంది ఎస్జీటీలను బదిలీ చేయగా వారు కొత్త స్థానాల్లో చేరారు. ఇందులో 157 మంది ప్రభుత్వ విభాగం, 1,164 జెడ్పీ విభాగం టీచర్లు ఉన్నారు. బదిలీల కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్న టీచర్లు ఇప్పుడు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో కొన్ని పాఠశాలల్లో టీచర్లకు దగ్గరి ప్రాంతాలు దక్కడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. సీనియారిటీ జాబితాలో వెనుక ఉన్నవారికి దగ్గరి ప్రాంతాలు వచ్చినట్లు ఆరోపిస్తున్నారు. అలాగే 46 మంది భాషా పండితులను కూడా ట్రాన్స్‌ఫర్ చేశారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు మంగళవారం (02న) ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారని దోస్త్ కోఆర్డినేటర్ కే సంపత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని అకడమిక్ ఆడిట్ సెల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని ఆయన తెలిపారు.

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా

బోధన్: దివ్యాంగులు, చేయూత పింఛన్ల పెంపు, ఇతర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా తలపెట్టామని వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ సోమవారం ప్రకటనలో తెలిపారు. ధర్నాకు దివ్యాంగులు, పింఛన్ లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. పింఛన్ల పెంపుపై సీఎం వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

జిల్లాలో 16.2 మి.మీ. వర్షపాతం

సుభాష్‌నగర్: జిల్లాలో ఆదివారం రాత్రి 16.2 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పోతంగల్‌లో 50.3 మిల్లీమీటర్లు, కోటగిరిలో 39.7, వర్నిలో 33.6, సాలూరలో 29.8, నందిపేట్‌లో 28.2, మోస్రా, రుద్రూర్‌లో 26.4, బోధన్, రెంజల్‌లో 26.2, నవీపేట్‌లో 23.2, డొంకేశ్వర్‌లో 21.8, చందూర్‌లో 21.6, నిజామాబాద్ సౌత్‌లో 20.2, నార్త్‌లో 19.6, మాక్లూర్‌లో 17.1, ఎడపల్లిలో 16.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లోనూ మోస్తరు వర్షం నమోదైంది. జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఏడు మండలాల్లో అత్యధిక వర్షపాతం, 14 మండలాల్లో సాధారణ, 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

- డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్



నిజామాబాద్ నాగారం: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం నగరంలోని బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాధులు, కీటకాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో గంగాధర్, డీహెచ్ఈ స్వామి సులోచన, డాక్టర్ సంతోష్‌కుమార్, హెడ్‌మాస్టర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు వనజ తదితరులు పాల్గొన్నారు.



కందకుర్తి వంతెన వద్ద ప్రవహిస్తున్న నీరు

బాబ్లీ గేట్ల ఎత్తివేత..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువన మహారాష్ట్ర సర్కార్ నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు త్రిసభ్య కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఎత్తారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం జూలై 1 న గేట్లు ఎత్తి, అక్టోబర్ 28న గేట్లను మూసి వేయాలి. మహారాష్ట్ర సరిహద్దులో గేట్లు మూసే వరకు నిల్వ ఉండే నీటికి బదులుగా మార్చి 1 గేట్లు ఎత్తి 0.6 టీఎంసీలు బాబ్లీ నుంచి ఎస్సారెస్పీకి అందించాలని తీర్పులో పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ ప్రభుత్వం తరపున ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ చక్రపాణి, ఏఈఈ వంశీ, మహారాష్ట్ర తరుపున నాందెడ్ ఈఈ బస్సోడ్, సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొని పర్యవేక్షించారు. వీరి పర్యవేక్షణలో ఉదయం 11.00 గంటల నుంచి గేట్లు ఎత్తడం ప్రారంభించి ప్రతి 45 నిమిషాలకొక గేటును ఎత్తుతు సాయంత్రం వరకు 14 గేట్లు ఎత్తినట్లు అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా వర్షాలు కురువడంతో బాబ్లీ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో గేట్లు ఎత్తగానే గోదావరిలోకి నీరు ఉరకలేసింది. బాబ్లీ ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 2.74 టీఎంసీలు. బాబ్లీ గేట్లు ఎత్తడంతో గోదావరికి జల కళ వచ్చింది. ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వస్తే ఎస్సారెస్పీకి అడ్డు లేకుండా బాబ్లీ గేట్లను అక్టోబర్ 28 వరకు తెరిచి ఉంచాల్సిందే.



బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి దిగువకు వస్తున్న నీరు



బాబ్లీ ప్రాజెక్ట్ వద్ద త్రిసభ్య కమిటీ సభ్యులు, అధికారులు

గోదావరికి జలకళ

రెంజల్(బోధన్): నిన్నటి వరకు నీళ్ల లేక ఇసుక మేటలతో దర్శనమిచ్చిన గోదావరి జలకళను సంతరించుకుంది. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు సోమవారం ఎత్తడంతో దిగువకు వరద నీరు పరుగులు పెడుతోంది. కందకుర్తి వద్ద వరద నీరు వచ్చి చేరడంతో పాటు మంజీర, హరిద్ర నదుల నుంచి వస్తున్న చిన్న పాయల నీటితో త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం వద్ద గోదావరి నది పరవళ్ల తొక్కుతోంది. నదిలోని పురాతన శివాలయాన్ని ఆనుకొని నీరు ప్రవహిస్తోంది. దీంతో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సిబ్బందితో పుష్కర ఘాట్లకు వచ్చి భక్తులను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద నీరు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి వరద నీరు కొనసాగుతోంది.ఎగువ ప్రాంతాల నుంచి 3,935 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం పెరుగుతుంది. బాబ్లీ గేట్లు ఎత్తడంతో మరింత వరద నీరు పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1059.90(10.74టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

అమల్లోకి కొత్త చట్టాలు

- తొలిరోజు 20కిపైగా కేసుల నమోదు



ఖలీల్‌వాడి: బ్రిటిష్ కాలంనాటి చట్టాలకు కాలం చెల్లించింది. ఈ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నేర, న్యాయ చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కో డ్ (ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో కొత్త చట్టాలకు అనుకూలంగా ఎస్సైలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులకు ఇప్పటికే కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. కాగా జిల్లాలో సోమవారం కొత్త చట్టాల ప్రకారం 20కి పైగా కేసులు నమోదు అయినట్లు తెలిసింది.

- నూతన చట్టాల ప్రకారం జిల్లాలో మొదటి కేసు నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైంది. గుర్తు తెలియని వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందాడు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేశారు. దీంతో ఎస్సై రామ్ కేసు నమోదు చేశారు. ఐపీసీ 174కు బదులుగా బీఎన్ఎస్ 194 కింద కేసు నమోదు చేశారు.
- నగరంలోని మూడో టౌన్ పరిధిలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపా రు. కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన రామవత్ శేఖర్(19) ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో చదువుతున్నాడు. శేఖర్ తన స్నేహితులతో కలిసి గౌతమ్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. గత నెల శేఖర్ తన తండ్రి లింబాద్రి వద్ద రూ.రెండు లక్షలు తీసుకొని వచ్చాడు. ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ 194 కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆపరేషన్ ముస్కాన్‌పై సమీక్ష

ఖలీల్‌వాడి: ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్‌పై సోమవారం సీపీ కార్యాలయంలోని పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లో డీసీపీ కోటేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈ నెల 1 నుంచి 30 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పిపోయిన, వదిలేసిన 18 ఏళ్లలోపు చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు. పిల్లలతో బలవంతంగా భిక్షాటన, వెట్టి చాకిరి చేయిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే విధంగా డివిజన్‌కు ఒక ఎస్సై, నలుగురు సిబ్బందిని నియమించామన్నారు. తప్పిపోయిన బాలబాలికలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్ రాజ్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ సురేష్, జిల్లా లేబర్ ఆఫీసర్ మోహన్, జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ సంపూర్ణ, డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, బాలల పరిరక్షణ అధికారి చైతన్య, నిజామాబాద్ ఇన్‌చార్జి మహిళా ఆర్ఎస్సై స్రవంతి, ఆర్మూర్ ఇన్‌చార్జి ఎస్సై హన్మాండ్లు, బోధన్ ఇన్‌చార్జి ఏఎస్సై బాబూరావ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలబాలికల సమాచారం అందించాల్సిన నంబర్లు
డయల్ 100
స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ : 8712659777
నిజామాబాద్ ఇన్‌చార్జి ఎస్సై : 8712659795
ఆర్మూర్ ఇన్‌చార్జి ఎస్సై : 9493021372
బోధన్ ఇన్‌చార్జి ఎస్సై : 9705083941

అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్య

- చిన్నారులకు ఆటపాటలతో పాటు విద్యా బోధన
- టీచర్లకు శిక్షణ ఇస్తున్న ఉన్నతాధికారులు

మోర్తాడ్(బాల్కొండ): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో పాటు నాణ్యమైన విద్య అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రీ స్కూలింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడం, ఆటలు, పాటలతోనే కాలక్షేపం చేసేవారు. ఇక నుంచి పూర్వ ప్రాథమిక విద్య అందించనున్నారు. జిల్లాలోని భీమ్‌గల్, అర్మూర్, బోధన్, నిజామాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పూర్వ ప్రాథమిక విద్యా బోధన ఎలా చేయాలి అనే అంశంపై మూడు రోజుల పాటు ఆయా ప్రాజెక్టు కార్యాలయాల్లో శిక్షణ ఇస్తున్నారు.

యూనిఫాంల పంపిణీకి ఏర్పాట్లు

మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య నేర్పేందుకు ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు ఆరంభించింది. చిన్నారులకు గతంలో యూనిఫాంలను సరఫరా చేయలేదు. ప్రీ స్కూలింగ్ విధానం అమలులోకి తీసుకువస్తున్న నేపథ్యంలో యూనిఫాం పంపిణీకి నిధులు మంజూరు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు రెండు జతల డ్రెస్‌లను పంపిణీ చేయనున్నారు.



ప్రీ స్కూలింగ్ విధానంపై శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

శిక్షణ కొనసాగుతుంది

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బోధించడానికి ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు విడతల వారిగా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి కాగానే ప్రీ స్కూలింగ్ విధానం అమలు చేస్తారు. చిన్నారుల సంఖ్యను పెంచాల్సి ఉంది. ప్రతి కేంద్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రయత్నిస్తున్నాం. – స్వర్ణ, ఇన్‌చార్జి సీడీపీవో, భీమ్‌గల్

డీఎస్ కాంగ్రెస్‌కు చేసిన సేవలు మరువలేనివి

- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ఖలీల్‌వాడి: సీనియర్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మర్చిపోలేనివని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి సీతక్క అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసంలో డీఎస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఆమె నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌ను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ డీఎస్ రెండు సార్లు పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. డీఎస్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటని చెప్పారు. డీఎస్ ఆశయాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లు అని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్లా రాజయ్య అన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేశ్‌రెడ్డి, నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, వీక్కీయాదవ్, వేణురాజ్, నరేందర్‌సింగ్, హాకీ శ్రీను ఉన్నారు.



డీఎస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సీతక్క, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య

అందరికీ అవకాశాలు ఇచ్చారు

- ఏపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

ఖలీల్‌వాడి: డీఎస్ అందరికీ అవకాశాలు కల్పించారని ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లోని డీఎస్ వ్యవసాయ క్షేత్రంలో దహన సంస్కారాలు చేసిన స్థలానికి వెళ్లి ఆయన డీఎస్‌కు నివాళి అర్పించారు. ఎంపీ అర్వింద్‌ను పరామర్శించారు. అనంతరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. డీఎస్, వైఎస్సార్ రెండు సార్లు కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి కృషి చేశారని తెలిపారు. డీఎస్ తనకు కూడా సహకారం అందించారని గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు, వైసీపీ పార్టీ నేతలు ఉన్నారు.



ఎంపీ అర్వింద్‌ను ఓదారుస్తున్న ఏపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు

- లభించని 'రైతుభరోసా'
- నిబంధనలపై స్పష్టత కరువు
- ఇప్పటికే ప్రారంభమైన సాగుపనులు



మోర్తాడ్(బాల్కొండ): పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించే 'రైతుభరోసా' పథకం అమలుకు ప్రభుత్వం ఇంకా ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు పక్క చూపులు చూడాల్సి వస్తోంది. ఇప్పటికే సాగు పనులు ప్రారంభం కావడంతో విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్లకు అద్దె ఇతర ఖర్చుల కోసం రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో భూ విస్తీర్ణంతో సంబంధం లేకుండా, పట్టా ఉంటే ఎకరానికి ఒక సీజన్‌లో రూ.5వేల చొప్పున సాయం అందించారు. షెడ్యూల్ ప్రకారం మేలోనే సాయం అందించాల్సి ఉండగా అప్పట్లో నిధుల విడుదలలో జాప్యం కారణంగా జూన్, జూలై నెలల్లోనే అందించారు. అయితే, రైతుబంధు పథకం అమలులో లోపాలు ఉన్నాయని, వాటిని సవరించి పెట్టుబడి సాయాన్ని 'రైతుభరోసా' కార్యక్రమం ద్వారా అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అలాగే రైతు భరోసా పథకం కింద ఎకరానికి ఒక సీజన్‌లో రూ.7,500 చొప్పున, ఏడాదికి రూ.15వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా రైతుభరోసా పథకానికి అర్హులు, అనర్హులు ఎవరనేది తేల్చలేదు. రైతుభరోసా మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో ఎవరికి సాయం అందుతుంది..? ఎవరికి అందదు..? అనే దానిపై స్పష్టత లేకుండాపోయింది. రైతు భరోసాను అర్హులకే అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించాల్సి ఉంది.

అసెంబ్లీ సమావేశాల తరువాతే సాయం?

వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో చర్చించిన తరువాతే రైతులకు పెట్టుబడి సాయం సొమ్ము జమ చేసే అవకాశం కనిపిస్తోంది. అర్హులను తేల్చేందుకు ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో భారీ కసరత్తు చేయాల్సి ఉంది. గడచిన యాసంగి సీజన్‌లో సమయం లేకపోవడంతో పాత విధానంలో పెట్టుబడి సొమ్మును జమ చేశారు. ఇప్పుడు కొంత ఆలస్యమైనా పక్కా విధివిధానాలను రూపొందించి సాయాన్ని అందించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలో గతంలో 2,73,595 మంది రైతులకు రూ.271.44 కోట్ల సాయం అందించారు. ఇప్పుడు నిబంధనలను సవరిస్తే సాయం పొందేవారి సంఖ్య తగ్గడంతోపాటు నిధులు కూడా తక్కువే అవసరం కానున్నాయి.

రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు

పెట్టుబడులకు సొమ్ము లేక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. గత ప్రభుత్వం ఈ సమయానికి సాయం అందించేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి సాయం సొమ్మును పెంచుతామని చెప్పి మాట నిలుపుకోలేదు. కనీసం పాత పద్ధతిలోనైనా సాయం అందించడం లేదు. ఏదో ఒకటి చేసి రైతులను ఆదుకోవాలి.

– కే చిన్న రాజేశ్వర్, రైతు, మోర్తాడ్



మెజారిటీ అభిప్రాయం మేరకే రైతుభరోసా



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

వేల్పూర్: రాష్ట్రంలో మెజారిటీ రైతుల అభిప్రా యం మేరకే రైతు భరోసా కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్ సొసైటీ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక మహాజనసభలో ఆయన మాట్లాడారు. ఈనెల 7 వరకు మహాజనసభల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు స్వీకరించడం పూర్తవుతుందన్నారు. అభిప్రాయ సేకరణ ముగిసిన వెంటనే ఖరీఫ్ పంటల సాగుకోసం రైతుభరోసా నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని అన్ని జిల్లాల డీసీసీబీ చైర్మన్లు కోరినట్లు చెప్పారు. సమావేశంలో వ్యవసాయాధికారి నర్సయ్య, జిల్లా ఆడిట్ అధికారి, డైరెక్టర్లు, కార్యదర్శి కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

4న ఈత పోటీలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న ఈత పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటలకు సుభాష్‌నగర్ ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రూప్ – 1 పోటీలో పాల్గొనే వారు 2007 నుంచి 2009 మధ్య, గ్రూప్ – 2లో 2010 నుంచి 2012 మధ్య, గ్రూప్ – 3లో 2013 నుంచి 2014 మధ్య, గ్రూప్ – 4లో 2015 నుంచి 2017 మధ్య జన్మించి వారై ఉండాలన్నారు. క్రీడాకారులు తమవెంట బొనాఫైడ్, ఆధార్, వయోధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 98669 70010 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

4న కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న ఉదయం 8గంటలకు గురువారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. 8,10,12 ఏళ్ల బాలబాలికలకు వివిధ అథ్లెటిక్స్ అంశాల్లో ఎంపికలుంటాయన్నారు. క్రీడాకారుల డ్రెస్‌కోడ్‌తో హాజరై పుట్టిన తేది సర్టిఫికేట్ జిరాక్స్ తప్పని సరిగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

బైక్‌సీటులో నాగుపాము



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో స్వీట్ దుకాణం నడుపుతున్న జ్ఞానేశ్వర్ ఎప్పటి లాగే దుకాణం పక్కనున్న గల్లీలో సోమవారం బైక్‌ను పార్క్ చేశాడు. సాయంత్రం బైక్ సీటులోకి చేరిన నాగుపామును గమనించిన స్థానికులు జ్ఞానేశ్వర్‌కు తెలిపారు. పామును బయటకి పంపించేందుకు జ్ఞానేశ్వర్ ఎంత ప్రయత్నించినా బయటకు రాకపోవడంతో పాములు పట్టే వ్యక్తిని రప్పించారు. సదరు వ్యక్తి పామును బయటికి తీయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఫీజు బకాయిలు చెల్లించండి

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 5వేల కోట్లు బకాయిలు చెల్లాంచాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, రాజేందర్, ప్రశాంత్, ఆత్మారాం తదితరులున్నారు.

ప్రజావాణికి 130 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్

సుభాష్‌నగర్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 130 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్ చక్రవర్తికి విన్నవించి అర్జీలు అందజేశారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో ఆయా కోర్సులు విద్యార్థులు పూర్తిచేసినప్పటికీ విద్యాసంస్థల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని కోరారు. నాయకులు శివాజీ, నవీన్, వంశీ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

కబ్జా అయిన భూమి స్వాధీనం చేసుకోవాలి

నగరశివారులోని 13వ డివిజన్ డెయిరీ ఫారం వాటర్ ట్యాంక్ ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమికి నకిలీ పట్టాలు సృష్టించి విక్రయిస్తున్నారని, కొందరు ఇళ్లు నిర్మించుకుంటున్నారని, వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు అక్బర్ నవాజుద్దీన్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా అక్రమంగా విక్రయిస్తున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారని అక్బర్ ఆరోపించారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేయాలని, కబ్జా చేసి ఇళ్లు నిర్మించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

బినామీ పేర్లతో హైరింగ్ వాహనాలు

జిల్లా వైద్యారోగ్యశాఖలో అధికారులే హైరింగ్ వాహనాలను బినామీ పేర్లతో పెట్టుకుని ప్రభుత్వ సొమ్మును కొల్లగొడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ నిజామాబాద్ ఇన్‌చార్జి సమీర్ అహ్మద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులే బినామీ పేర్లతో వాహనాలు పెట్టుకోవడంతో ఉపాధి అవకాశం లేక క్యాబ్ ఓనర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందించడం లేదన్నారు. బినామీ పేర్లతో పెట్టిన హైరింగ్ వాహనాలను తొలగించి పేదలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న సమీర్ అహ్మద్

ఆశ్రమ భూమి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



మోపాల్ మండలం సిర్‌పూర్ శివారులో ఆశ్రమానికి కేటాయించిన 5 ఎకరాల అసైన్డ్ భూమిని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు కబ్జా చేశారని, వెంటనే వారిపై చర్యలు తీసుకుని భూమిని ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించాలని దేవాలయ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పటేల్ ప్రసాద్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవధూత నిర్మలానంద స్వామికి 1984లో అప్పటి ప్రభుత్వం సిర్‌పూర్ శివారులో 5 ఎకరాల అసైన్డ్ భూమిని కేటాయించిందని, పట్టాపాస్ పుస్తకాలు స్వామిజీ పేరుపై ఉన్నాయని, రైతు బంధు కూడా ఆయన ఖాతాలోకే వస్తోందని తెలిపారు. అయినప్పటికీ మాజీ ప్రజాప్రతినిధులు ఆ భూమిని కబ్జా చేసి హద్దురాళ్లను తొలగించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. 2019 నుంచి అనారోగ్య సమస్యల కారణంగా నిర్మలానంద స్వామి ఆ భూమిని పడావుగా వదిలేశారని, దీంతో నర్సింగ్‌పల్లి గ్రామస్తులు కొందరు కబ్జా చేసి మాజీ ప్రజాప్రతినిధులకు విక్రయించారన్నారు. ఆయనవెంట ఆశ్రమ నిర్వాహకులు, పరిరక్షణ కమిటీ ప్రతినిధులు అవధూత నిర్మలానంద స్వామి, నరేశ్, రామరాజు, రాహుల్, చైతన్య కులకర్ణి, కిషన్, ఆకాశ్, సాయి కృష్ణ, హర్షవర్ధన్, ప్రసాద్, రాజు ఉన్నారు.

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి



మెగా డీఎస్సీని ప్రకటించి సెప్టెంబర్‌లో పరీక్ష నిర్వహించాలని బీవీఎం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ బట్టు డిమాండ్‌చేశారు. టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ద్వారా ఏర్పడిన ఖాళీలను కూడా భర్తీ చేయాలన్నారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. శ్రీధర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యలపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్‌కు ఏదైనా జరిగితే ఊరేకోబోమని హెచ్చరించారు.

ఉద్యమించాలి.. కానీ ప్రాణాలు కోల్పోవద్దు



విద్యార్థులతో ప్రొఫెసర్ కోదండరాం

నిజామాబాద్‌అర్బన్: నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఉద్యమాలు చేయాలి.. కానీ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోవద్దని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ దీక్షను విరమించాలని, నేను కూడా మీ వెంటే ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటర్ టాపర్లకు గత నాలుగేళ్లుగా టీవీయూవీ ఆధ్వర్యంలో అవార్డులను అందజేయడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే విజయం మీ సొంతమవుతుందని విద్యార్థులకు సూచించారు. ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్న విద్యార్థులను డీఐఈవో రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వొకేట్ ఆశ నారాయణ, టీజేఎస్ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్‌యాదవ్, టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌సింగ్, జిల్లా ఇన్‌చార్జి నవీన్, కన్వీనర్ అజయ్, సుభాష్, సన్నీ, అజయ్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరు మృతి

- ఘటనాస్థలంలో ఒకరు..
- చికిత్స పొందుతూ మరొకరు
- మృతులు గాంధారి మండలం కాటేవాడికి చెందిన వారు..




రవీందర్(ఫైల్)



దేవీసింగ్ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ఘటనాస్థలంలో ఒకరు మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గాంధారి మండలం కాటేవాడి తండాకు చెందిన కొర్ర రవీందర్(24), మిత్రుడు దేవిసింగ్ కలిసి ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ కోసం కామారెడ్డికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నారు. మండల కేంద్రం శివారులోని 44వ నంబర్‌జాతీయ రహదారిపై మల్లుపేట్ వాగు సమీపంలోని తాజ్‌ఫ్యామిలీ దాబా వద్ద ట్రాక్టర్‌ను వెనుక నుంచి అతివేగంగా వచ్చినలారీ ఢీకొట్టింది. ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో డ్రైవింగ్ చేస్తున్న దేవిసింగ్(34)తోపాటు రవీందర్ రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్రగాయాలై రవీందర్ అక్కడి కక్కడే మృతి చెందాడు. దేవిసింగ్‌ను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవీందర్‌కు మూడు నెలల క్రితం వివాహమైందని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడు..




సాయికిరణ్ (ఫైల్)

వర్ని (మోస్రా): ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. మోస్రా మండలం గోవూర్ శివారులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రుద్రూర్ మండలం చిక్కడపల్లికి చెందిన సాయికిరణ్ (18) వర్ని నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా, గోవూరు శివారులో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సాయి కిరణ్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు.

ప్రమాదవశాత్తు పొలంలోపడి..

వర్ని (చందూర్) : ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి వ్యవసాయ భూమిలోని బురద లోపడి మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చందూరుకు చెందిన గంగోటి నారాయణ (70) గతనెల 28వ తేదీన గ్రామ శివారులోని తన పొలానికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. అయితే, సోమవారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల్లోకి వెళ్లిన రైతులు నారాయణ మృతి చెంది ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



నారాయణ మృతదేహం

పాముకాటుతో మహిళ..



జనవ్వ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్ తండాకు చెందిన గిరిజన మహిళ నునావత్ జనవ్వ(41) పాముకాటుతో మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. ఆదివారం రాత్రి జనవ్వ భోజనం చేసి నిద్రకు ఉపక్రమించింది. ఆమె నిద్రిస్తున్న సమయంలో నల్లత్రాచు పాము కాటు వేయగా, ఆమె వెంటనే తేరుకుని కుటుంబసభ్యులకు తెలుపగా, వారు ఆమెను హుటాహుటిన కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.కాగా,జనవ్వ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య



పోశెట్టి మృతదేహం

వర్ని (మోస్రా): మండలంలోని గోవూరు గ్రామానికి చెందిన ఈబితి పోశెట్టి (25) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువకావడం, మరోవైపు భార్యతో విడాకులు తీసుకోవడంతో మనస్తాపానికి గురైన పోశెట్టి సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మతిస్థిమితం లేని బాలిక..



భిక్కనూరు: మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద కూలీ పనులు చేస్తూ ఓ కుటుంబం జీవిస్తోంది. ఆ కుటుంబంలోని 15ఏళ్ల బాలిక కొంతకాలం క్రితం మతిస్థిమితం కోల్పోయింది. సోమవారం కుటుంబ సభ్యులు విత్తనాల కోసం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణానికి వెళ్లగా.. ఆమె అక్కడే ఉన్న చెట్టుకు ఉరేసుకుంది. గమనించిన కూలీలు ఆమెను చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే మృతి వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

నిజామాబాద్ రూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతినగర్‌లో అనిరుధ్‌రెడ్డి అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొన్ని రోజులుగా అనిరుధ్‌రెడ్డి(28) స్విగ్గీలో పని చేస్తుండగా, అతడి భార్య స్వాతి ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. సోమవారం ఉదయం రోజూలాగే స్వాతి డ్యూటీకి వెళ్లగా అనిరుధ్ ఇంట్లోనే ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువకావడంతో మనస్తాపానికి గురైన అనిరుధ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మహారాష్ట్రకు చెందిన వ్యక్తి..

నవీపేట: మండలంలోని గాంధీనగర్ శివారులో ఉనన కోళ్లఫామ్‌లో మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన ప్రతాప్ లాడిగె(40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం ప్రతాప్ రెండేళ్ల క్రితం భార్యాపిల్లలతో కలిసి గాంధీనగర్‌కు వచ్చాడు. ఏడాది క్రితం జరిగిన ఓ ప్రమాదంలో ప్రతాప్ రెండు కాళ్లు కోల్పోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక వేలం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఆవరణలో సోమవారం మూడు ట్రాక్టర్ల ఇసుకను వేలం వేశారు. వేలంలో పాల్గొన్న వారు మూడు ట్రాక్టర్ల ఇసుకను రూ.5,300కు దక్కించుకున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను గతనెల 21న పట్టుకొని వేలం వేశామన్నారు.

విద్యావ్యవస్థ సక్రమంగా నడవాలి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



పెద్ద ఎక్లారలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న విద్యార్థిని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మద్నూర్(జుక్కల్) : నియోజకవర్గంలో విద్యావ్యవస్థ సక్రమంగా నడవాలని దీనికోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశించారు. మండలంలోని పెద్దఎక్లార బాలికల గురుకుల పాఠశాలలో నియోజకర్గంలోని గురుకుల పాఠశాలలు, నవోదయ, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల ప్రిన్స్‌పాళ్లతో సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నియోజవర్గంలో విద్యావ్యవస్థ వెనుకబడి ఉన్న పేరును చెరిపేసే విధంగా ప్రిన్స్‌పాళ్లు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఇక నుంచి నియోజికవర్గంలోని ప్రతి పాఠశాల, కళాశాలను సందర్శిస్తానన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుల కోసం రూ. కోట్ల నిధులు, వసతులు కల్పిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల, కళాశాలలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు, లెక్చరర్ల భర్తీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రిన్స్‌పాళ్లు పాల్గొన్నారు.

‘రైతుబంధు’పై భిన్నాభిప్రాయాలు



మాట్లాడుతున్న జిల్లా అధికారి రామ్మోహన్‌రావు



అధికారిని సన్మానిస్తున్న చైర్మన్ నర్సింహారెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ‘రైతుబంధు’చెల్లింపుపై నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట, తాండూర్‌లలో సోమవారం నిర్వహించిన సమావేశాలలో రైతులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. గోపాల్‌పేటలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో కొందరు రైతులు 5 ఎకరాలు, మరికొందరు పదెకరాలకు పరిమితం చేయాలని పేర్కొన్నట్లు మాల్తుమ్మెద సొసైటీ సీఈవో పవన్ తెలిపారు. మండలంలోని తాండూర్ సొసైటీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలోనూ భిన్నాభిప్రాయాలు వచ్చాయన్నారు. ఎక్కువ మంది రైతులు 5ఎకరాలకు పరిమితం చేయాలని కోరుతూ సొసైటీ సీఈవో జైపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి రామ్మోహన్‌రావు, పర్యవేక్షణాధికారిణి రాధిక, నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీతరెడ్డి, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఏడీఏ వీరాస్వామి, ఏవో విజయ్‌శేఖర్, సొసైటీల చైర్మన్‌లు నర్సింలు పాల్గొన్నారు.

అర్హులందరికీ వర్తింపజేయాలి..

నిజాంసాగర్(జుక్కల్): వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసా వర్తించేలా ప్రభుత్వ పరంగా సమన్యాయం చేయాలని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అచ్చంపేట రైతు వేదికలో రైతుబంధు, రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. 20ఎకరాల వరకు రైతు రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు పేర్కొన్నారు. మరికొందరు పదెకరాల్లోపే వర్తింపజేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రిజిస్ట్రార్ సికింద్రాబాద్ వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఏవో అమర్‌ప్రసాద్ తదితరులున్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోనీ శ్రీలత గార్డెన్స్‌లో విశ్వోదయ పాఠశాల పూర్వ విద్యార్థులు (2004–05 బ్యాచ్) సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒకే వేదికపైకి చేరుకొని ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం వైద్య వృత్తిలో ఉన్న తమ తోటి మిత్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వోదయ విద్యా సంస్థల అధినేత జవహర్‌బాబు హాజరయ్యారు.

29 వాహనాలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 29 వాహనాలను పట్టణ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు ఉండాలని స్పష్టం చేశారు.

కొడుకును చంపిన తండ్రి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి: భూమి పంపిణీ విషయంలో తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్న తనయుడిని హత్య చేసిన తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటకు చెందిన పాడిపాక సాయిలు(40)ను అతడి తండ్రి పాడిపాక వెంకటేశ్ గత నెల 28వ తేదీన రాత్రి టవల్‌తో గొంతు నులిమి, కర్రతోబాది హత్య చేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా పక్కనే ఉన్న పోచారం కాలువలో సాయిలు మృత దేహాన్ని పారేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు వెంకటేశ్‌ను విచారించగా, పొలం పంపకం విషయంలో తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తానే హత్య చేసినట్లు నేరం అంగీకరించాడు. సాయిలును హత్య చేసేందుకు నిందితుడు ఉపయోగించిన టవల్‌తోపాటు కర్రను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై మహేశ్, హోం గార్డులు పెంటయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

- బాన్సువాడ, బోధన్‌లో తనిఖీలు
- ముగ్గురి అరెస్ట్, రిమాండ్



గంజాయిని చూపుతున్న పోలీసులు

బాన్సువాడ : పట్టణంలోని పీఆర్ గార్డెన్ వెనుక ప్రాంతంలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. నిందితుడు అందించిన సమాచారం మేరకు బోధన్‌లోని ఇంటిపై దాడి చేసి మరో 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. డీఎస్పీ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బాన్సువాడలోని కొయ్యగుట్ట సమీపంలో ఉన్న పీఆర్ గార్డెన్ వెనుకాల గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న సీమల శ్రీకాంత్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా.. తాను బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన నస్రీన్ బేగం అలియాస్ సుమేరాభాను అనే మహిళ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు బోధన్‌కు వెళ్లి నస్రీమ్ బేగం ఇంట్లో సోదాలు నిర్వహించి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలితోపాటు ఆమె మామ రషీద్‌ను విచారించగా మహారాష్ట్రలోని నాయ్‌గావ్ ప్రాంతం నుంచి గంజాయి తెచ్చినట్లు ఒప్పుకున్నారు. శ్రీకాంత్, నస్రీమ్ బేగం, రషీద్‌పై కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి కేసును చాకచక్యంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన టౌన్ సీఐ కృష్ణ, సిబ్బందిని ఎస్పీ సింధుశర్మ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.